క్లుప్తంగా

నియామకం



స్టేషన్‌ఘన్‌పూర్: మన టీఆర్‌ఎస్(తెలంగాణ రాష్ట్ర సమాఖ్య) మండల అధ్యక్షుడిగా ఘన్‌పూర్‌కు చెందిన మాచర్ల శ్రీనివాస్‌గౌడ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు వంగ వేణుగౌడ్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ గౌస్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం శ్రీనివాస్‌గౌడ్‌కు వారు నియామకపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడిగా నియామకం కావడం సంతోషంగా ఉందని, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసేలా శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మండల అధ్యక్షుడిగా నియమించిన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

పరామర్శ



బచ్చన్నపేట: మండలంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి తల్లి రాములమ్మ (88) మృతి చెందింది. కాగా, ఆదివారం రమణారెడ్డిని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిలతో పాటు పలువురు నాయకులు పరామర్శించారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొని ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంపీపీ బావండ్ల నాగజ్యోతి, జనగామ ఆస్పత్రి సూపరింటెండెంట్ సుగుణాకర్ రాజు, నాయకులు యంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉన్నారు.

నేడు కంచనపల్లి సొసైటీ సమావేశం

రఘునాథపల్లి: నేడు కంచనపల్లి సొసైటీ జనరల్‌బాడీ సమావేశం మండల కేంద్రంలోని కంచనపల్లి సొసైటీ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించనున్నట్లు సొసైటీ చైర్మన్ చీ మలపాటి రవీందర్ ఆదివారం తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశా నికి సొసైటీ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ

కొడకండ్ల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌కు ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీ ఎదుగుతుందని బీజేపీ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ కోటేశ్వర్ రావు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వరంగల్‌లో ప్రధాని విజయసంకల్ప బహిరంగ సభ విజయవంతమైందని, నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చారని అన్నారు. కార్యకర్తలు ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతూ పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థికి అభినందనలు

పాలకుర్తి: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించిన 9వ తరగతి ఎంట్రన్స్ పరీక్ష ఫలితాల్లో లక్ష్మీనారాయణపురం గ్రామానికి చెందిన బండిపెల్లి సాత్విక్ ఆలిండియా స్థాయిలో 23వ ర్యాంకు సాధించాడు. కాగా, ఆదివారం సాత్విక్‌ను సుధా టెక్నోస్కూల్ డైరెక్టర్ రాపాక విజయ్ ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ దేశంలోనే అత్యుత్తమ స్కూల్‌లో సాత్విక్ పైచదువులు చదివేందుకు కేంద్రం సహకరిస్తుందని అన్నారు.

మున్సిపల్ కమిషనర్ కారుకు ప్రమాదం



జనగామ: జనగామ ఆర్టీసీ చౌరస్తాలో శనివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ కమిషనర్ కారుకు ప్రమాదం జరిగింది. డ్రైవర్ రఘునాథపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో జంక్షన్‌లో లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. తృటిలో డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించు కోగా, అక్కడే ఉన్న పలువురు స్థానికులు పోలీ సులకు సమాచారం అందించారు. ఈ విషయమై కమిషనర్ రజిత మాట్లాడుతూ డ్రైవర్ రఘునాథపల్లికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో కారును లారీ ఢీకొట్టిందని, దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు స్పష్టం చేశారు.

విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

నర్మెట: మండలంలోని హన్మంతాపురంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతిచెందిన సంఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. రైతు బోజ్జ బుచ్చయ్య రోజువారిలాగా తన పశువులను వ్యవసాయ పొలం వద్ద కట్టేసి వచ్చాడు. కాగా, శనివారం రాత్రి ఈదురు గాలులవర్షానికి స్తంభం పైనుంచి తెగిపడిన విద్యుత్ వైరు కారణంగా పాడిగేదె మృతిచెందింది. దీంతో రూ. 60 వేలు నష్టం వాటిల్లినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నష్టపరిహారం ఇప్పించాలని కోరాడు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



లింగాలఘణపురం: మాట్లాడుతున్న కనకారెడ్డి



దేవరుప్పుల: మాట్లాడుతున్న వెంకన్న



బచ్చన్నపేటలో..

లింగాలఘణపురం: గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కనకారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గత నాలుగు రోజులుగా జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మెను సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ సిబ్బంది చేస్తున్న శ్రమకు తగిన ఫలితం దక్కడంలేదని, ఎన్నోసార్లు విన్నపాలు చేసినా ప్రభుత్వం స్పందించడంలేదని, ఇప్పటికైనా వారి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. జీపీ సిబ్బంది మండల అధ్యక్షుడు యాకుబ్, పాండురంగం, మహేందర్, సునీల్, కిరణ్, కనకలక్ష్మి, ప్రమీల, యాదమ్మ, నరేశ్, రాములు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందిపై నిర్లక్ష్యం తగదు

దేవరుప్పుల : చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న క్షేత్రస్థాయి జీపీ ఉద్యోగులు, సిబ్బంది సమస్యల పరిష్కారంలో పాలకుల నిర్లక్ష్యం తగదని గ్రామపంచాయతీ ఉద్యోగ కార్మిక సంఘాల జేఏసీ జిల్లా కన్వీనర్స్ బత్తిని వెంకన్న విమర్శించారు. ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో వద్ద 4వ రోజుకు గ్రామ పంచాయతీ ఉద్యోగ కార్మికుల సిబ్బంది సమ్మె దీక్షలో మాట్లాడారు. రామచంద్రు, కరుణాకర్, గొడిశాల సోమయ్య, ధారవత్ రమేష్, కారుపోతుల శంకర్, గుగులోతు రమేష్, భాషిపాక ఎల్లయ్య, లక్ష్మి పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల నాయకులు కుంభం రాజు, బోసు రాజు డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని, వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమీపాన జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారంతో నాల్గవ రోజుకు చేరింది. సమ్మెలో కార్మికులు ఎడ్ల రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



జనగామ రూరల్: సమ్మెలో జీపీ కార్మికులు

బచ్చన్నపేట: జీపీల్లో పని చేస్తున్న అన్ని కేటగిరీల సిబ్బంది సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట జీపీ సిబ్బంది చేపట్టిన సమ్మె 4వ రోజుకు చేరింది. నిత్యం ప్రజలకు సేవ లందిస్తున్న సిబ్బంది సేవలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాజు, ప్రభాకర్, అశోక్, కిష్టయ్య, బాబుగౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వం స్పందించే వరకు మద్దతుగా నిలుస్తాం..

రఘునాథపల్లి: న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం స్పందించి పరిష్కరించే వరకు పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు మద్దతుగా నిలుస్తామని ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, బాంజీపేట ఎంపీటీసీ రచ్చ సోమనాథం అన్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు ఆయన సంఘీభావం తెలిపారు. రాజేష్, బుచ్చయ్య, అయోధ్య, రాజయ్య, బాబు, రాజ్‌కుమార్, భాస్కర్, నాగరాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

తరిగొప్పుల: జీతాల పెంపు, పర్మనెంట్ చేయాలని పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 4వ రోజుకు చేరుకుంది. గ్రామాభివృద్ధికి జీపీ కార్మికులు వెట్టి చాకిరీ చేస్తున్నారని, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అమలుచేయకపోవడం బాధాకరమన్నారు. సాంబారి కృష్ణమూర్తి, రామచంద్రం, ములుగు రాంనారాయణ, రాజకొమురయ్య, సతీష్ గౌడ్, ప్యారపు నవీన్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె

జనగామ రూరల్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపడుతున్న జీపీ కార్మికుల సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా దీక్షలను మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రామగుండం రామ నర్సింహులు ప్రారంభించి మాట్లాడారు. వివిధ గ్రామాల సిబ్బంది పాల్గొన్నారు.



స్టేషన్‌ఘన్‌పూర్: సమ్మెలో జీపీ కార్మికులు



రఘునాథపల్లి: మాట్లాడుతున్న సోమనాథం



తరిగొప్పులలో..

కేజీకేఎస్ ధర్నాను జయప్రదం చేయండి

స్టేషన్‌ఘన్‌పూర్: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నేడు(సోమవారం) కలెక్టరేట్‌ల ఎదుట నిర్వహించనున్న ధర్నాలో కల్లుగీత కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కేజీకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్నె వెంకటమల్లయ్య పిలుపునిచ్చారు. డివిజన్ కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులవృత్తిదారులకు ఇవ్వనున్న రూ. లక్ష సబ్సిడీ రుణాలను గీత కార్మికులందరికి ఇవ్వాలన్నారు. గీత కార్మికుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరారు.

బీసీ కులవృత్తుల్లో గీత కార్మికులను చేర్చాలి



చిల్పూరు: మాట్లాడుతున్న రమేష్

చిల్పూరు: బీసీ కులవృత్తుల్లో గీతకార్మికులను చేర్చాలని కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గణగోని రమేష్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ కులవృత్తి దారులకు రూ.లక్ష ఇస్తామంటూ ప్రభుత్వం ఇటీవల ప్రకటించిందని, ఎలాంటి ఆధారం లేకుండా గీత వృత్తినే నమ్ముకొని కుటుంబాలను పోషించుకుంటున్న గీత కార్మికులకు రూ. లక్ష సాయం అందజేయాలని కోరారు. నేడు కలెక్టరేట్ ఎదుట నిర్వహించే గీతకార్మికుల ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ సభ్యులు కంకటి రాజన్న, మాచర్ల ప్రవీణ్, బొందయ్య, రంగు రవి, రాములు, వెంకన్న, స్వామి, శ్రీనివాస్, కొంరయ్య, రాజు పాల్గొన్నారు.

సాయిచంద్‌కు నివాళి

జనగామ: ప్రముఖ కళాకారుడు సాయిచంద్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా, ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన దశదినకర్మలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయిచంద్ మాట మూగబోయినా ఆయన పాడిన పాటలు చరిత్ర ఉన్నంత కాలం ప్రజల ముగింట వినిపిస్తూనే ఉంటాయన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

కంటితుడుపు చర్యలతో విద్యావ్యవస్థ నిర్వీర్యం

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం కంటితుడుపు చర్యలతో విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని ఏబీవీపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ కారుపోతల నరేష్ విమర్శించారు. ఆదివారం మండలంలోని పెద్దమడూరులో ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించి మాట్లాడారు. గత 75 సంవత్సరాలుగా విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా అనుక్షణం పోరాటాలు చేస్తూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పాటుపడిన ఏకైక విద్యార్థి సంఘంగా గుర్తింపు ఉందన్నారు. జాతీయత భావంతో దేశభక్తిని పెంపొందించే ఏబీవీపీలో విద్యార్థిలోకం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. రవికుమార్, అరవింద్, అభినవ్, కార్తీక్, సన్నీ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నరేష్

జీపీ భవన పనులు ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

జఫర్‌గఢ్: మండలంలోని తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్‌లో చేపట్టిన గ్రామపంచాయతీ భవనాల అసంపూర్తి నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిమ్మాపూర్, హిమ్మత్‌నగర్‌లో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. వీటిని పూర్తి చేసేందుకు ఒక్కో జీపీకి అదనంగా రూ.5 లక్షల నిధులను మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రడపాక సుదర్శన్, జెడ్పీటీసీ సభ్యురాలు ఇల్లందుల బేబి శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తాటికాయల అశోక్, పొన్నాల జ్యోతి నాగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు యారా నీలమ్మ సోమిరెడ్డి, మార్కెట్ డైరక్టర్ రాజు, పార్టీ నాయకులు స్వామి, యాదగిరి, తాటికాయల బాబు, సోమయ్యతోపాటు తదితరులు పాల్గొన్నారు.

బ్యాగ్‌ల పంపిణీ



జనగామ రూరల్: అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వర్ధన్ ఆశ్రమంలో ఇండియన్ బ్యాగ్ హౌజ్ నిర్వాహకులు మోహినుద్దిన్, బషిరుద్దిన్, సుమైర్, ఇమ్రాన్ సహకారంతో విద్యార్థులకు బ్యాగ్‌లు పెన్నులు అందజేశారు. అమ్మ టీం సభ్యులు మంతెన మణి వంగబీం రాజ్ , తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో గురువులతో పూర్వ విద్యార్థులు

లింగాలఘణపురం: మూడు దశాబ్దాల క్రితం కలిసి చదువుకున్న అనుభూతులతో ఆదివారం మండలంలోని చీటూరు ఉన్నత పాఠశాల 1990-1991 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేశం, ఎంపీటీసీ సోమలక్ష్మి, ఆనాటి ఉపాధ్యాయులు ధర్మయ్య, లక్ష్మీనారాయణచారి, మల్లయ్య, శేషయ్యలతో పాటు పూర్వ విద్యార్థులు రాజ్‌కుమార్‌రెడ్డి, చక్రపాణి, శోభారాణి, లక్ష్మి, యాదగిరి, వెంకట్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, కుమారస్వామి, రఘు, రవి, రాజిరెడ్డి, రాధా, బేబీ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లు పొందండి



లైసెన్స్‌ల కోసం పత్రాలు స్వీకరిస్తున్న నాయకులు

నర్మెట: అర్హత గల యువతీ యువకులు ద్విచక్ర, లైట్‌మోటార్ వాహనముల డ్రైవింగ్ లైసెన్స్‌లు కలిగి ఉండాలని ఎంపీపీ తేజావత్ గోవర్ధన్, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయ ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆదేశాలతో నియోజక వర్గ కోఆర్డినేటర్ గుజ్జ సంపత్ రెడ్డి సూచనలతో లైసెన్స్‌లు ఇప్పించేందుకుగాను నిర్ణయించినట్లు వారు తెలిపారు. ఈ సదవకాశాన్ని 18 ఏళ్లు నిండి డ్రైవింగ్ తెలిసినవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పాస్‌పోర్టు ఫొటో, ఎస్సెస్సీ మెమో, ఆధార్ కార్డు, పాన్‌కార్డుల జిరాక్స్ కాపీలను జనగామ పట్టణం, జనగామ మండలానికి చెందిన వారు జిల్లా క్యాంపు కార్యాలయంలో, మిగిలిన మండలాలవారు సంబంధిత బీఆర్‌ఎస్ నాయకులను సంప్రదించాలని తెలిపారు. ఈ సందర్భంగా నర్మెటలో 54 మంది పేర్లను నమోదు చేసుకున్నారని చెప్పారు. జెడ్పీ కోఆప్షన్ ఎండి గౌస్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రామిని శివరాజ్, స్థానిక సర్పంచ్ ఆమెడపు కమలాకర్‌రెడ్డి, టౌన్ అధ్యక్షుడు నక్కల రవి, జిల్లా నాయకులు పిట్టల రాజు, ఇట్టబోయిన రమేష్, కుంటి కమలాకర్, బెడదం సుధాకర్, కొండ బాలయ్య, కొన్నె చంద్రయ్య, గోపగోని రవి, బుడ్డా భాస్కర్, తదితరులు ఉన్నారు.

వన భోజనాలకు తరలిన గౌడ కులస్తులు



గ్రామదేవతకు పూజ చేస్తున్న గౌడ కులస్తులు

కొడకండ్ల: మండలకేంద్రానికి చెందిన గౌడ కులస్తులు ఆదివారం వనభోజనాలకు వెళ్లారు. గ్రామ శివారులోని పంట పొలాలకు వెళ్లి వంటలు చేసుకొని గ్రామదేవతలకు పూజ చేసి నైవేద్యాలు స మర్పించారు. వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, అందరు ఆరోగ్యంగా ఉండాలని వేడుకొన్నారు.

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

బచ్చన్నపేట: ప్రతి ఉద్యోగి అంకితభావంతో పని చేసినప్పుడే గుర్తింపు లభిస్తుందని మండలంలోని బండనాగారం, లక్ష్మాపూర్ సర్పంచ్‌లు శివరాత్రి కవిత, నూకల నవ్య అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీనిధి గార్డెన్‌లో జరిగిన ఆర్టీసీ అకౌంట్ సెక్షన్ వరంగ్ రీజనల్ అధికారి నూకల మల్లారెడ్డి ఉద్యోగ విరమణ సమావేశానికి వారు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లారెడ్డిని సన్మానించారు. కార్యక్రమంలో కొప్పురవు శ్రీనివాస్‌రెడ్డి, రాపెల్లి జనార్ధన్,శివరాత్రి రాజనర్సు, నూకల నర్సిరెడ్డి, సోమిరెడ్డి, ఆగారెడ్డి, రమేష్‌రెడ్డి, బాల్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సంజీవరెడ్డి, పల్లపు రామకృష్ణ, ఇమ్మడి లక్ష్మయ్య, పిడుగు మహేష్, మలిపెద్ది యాకయ్య పాల్గొన్నారు.



మల్లారెడ్డి ఉద్యోగ విరమణలో సర్పంచ్‌లు

ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి రవికాంత్ తోడ్పాటు

దేవరుప్పుల: ఎవరో వస్తారని.. ఏదో చేస్తారని ఎదురుచూసే కంటే విద్యార్థులకు విద్యాబోధన చేసే ఉపాధ్యాయుల ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలకు దాతల తోడ్పాటు ప్రక్రియ పెద్దమడూరులో శ్రీకారం చుట్టింది. మండలంలోని పెద్దమడూరులోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న బెహరా రవికాంత్ శంకరాచార్య సేవా సమితి పేరిట వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి పూర్వ విద్యార్థులు, గ్రామస్తులు, తన స్నేహితులను చేర్చారు. నిరుపేద పిల్లలకు నిలయంగా మారిన పాఠశాలలకు ప్రభుత్వ తోడ్పాటుతో పాటు దాతల సహకార ఆవశ్యకతను వాట్సప్ గ్రూపులో వెల్లడించారు. తద్వారా ఈ ప్రాంతానికి సంబంధంలేని వ్యక్తి పెద్దమడూరు హైస్కూల్‌కు రూ. 8 వేలు వెచ్చించి పాఠశాలలోని 100 మంది పిల్లలకు కావాల్సిన మధ్యాహ్నభోజన ప్లేట్లు, రాగి జావ తాగడానికి గ్లాసులు, స్పూన్‌లు అందించారు. అలాగే మాదాపురంలో ప్రాథమిక పాఠశాలకు హైదరాబాద్‌కు చెందిన దాత ద్రాక్ష్యాయని జయంతికి రూ.9 వేలు వెచ్చించి విద్యార్థులకు షూ పంపిణీ చేశారు.



దాతలు అందజేసిన ప్లేట్లతో పెద్దమడూరు పాఠశాల విద్యార్థులు (ఫైల్)

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

స్టేషన్‌ఘన్‌పూర్: గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేదల సంక్షేమం సాధ్యమైందని, అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య అన్నారు. గడపకు గడపకు కాంగ్రెస్‌పార్టీ–సాంబయ్య నినాదంతో మండలంలోని అక్కపెల్లిగూడెం, కోమటిగూడెం గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలను కలిసి వారితో మాట్లాడారు. రానున్న రోజుల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించి గెలిపించాలని ఆయన కోరారు. పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల నరేందర్‌రెడ్డి, నాయకులు కత్తుల కట్టయ్య, పోలెపల్లి సంపత్‌రెడ్డి, నీల రాకేష్, నాగబండి సంతోష్, ఇంద్రారెడ్డి, ఆకుల రమేష్, అయ్యప్పశ్రీను, భూపాల్‌రెడ్డి, యార ఎల్లయ్య పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న దొమ్మాటి సాంబయ్య

'హరితహారం'తో గ్రామాన్ని పచ్చదనంగా మారుస్తాం..

చిల్పూరు: హరితహారంతో గ్రామాన్ని పచ్చదనంగా మారుస్తామని సర్పంచ్ కొంగరి రవి, ఉప సర్పంచ్ బబ్బుల వంశీ అన్నారు. మండలంలోని మల్కాపూర్ సమీపంలో 15 గుంటల భూమిలో పంచాయతీ కార్యదర్శి కందగట్ల శ్రీధర్ సిబ్బందితో నాటిస్తున్న మొక్కలను ఆదివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెట్లు లేకపోవడంతోనే సకాలంలో వర్షాలు కురువడం లేదని, అందుకే ప్రతీ ఇంట్లో మొక్కలు నాటడంతో పాటు అవి చెట్లుగా ఎదిగే వరకు కాపాడాలని కోరారు. వెన్నం మాధవరెడ్డి, అలుగు అశోక్, సతీష్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి


లింగాలఘణపురం: జనగామ–సూర్యాపేట రోడ్డులోని పటేల్‌గూడెం శివారులో గుడిసెవాసులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం గుడిసెవాసుల వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత డిసెంబర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసుకొని అక్కడే ఉంటున్నారని, శనివారం రాత్రి నల్ల లాజర్ మరికొంత మంది అక్కడికి వచ్చి గుడిసెలు వేసుకుంటున్న వారిపై కర్రలతో దాడి చేశారని, గుడిసెలు తగులబెట్టారని, ఇక్కడ ఎవరు మిమ్ములను గుడిసెలు వేసుకోమన్నారని బెదిరించారని అన్నారు. ఇలా దౌర్జన్యం చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని అన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్, నాయకులు దేవదానం, శంకరయ్య, సమ్మయ్య, ఎల్లయ్య, రవి, శ్రీనివాసు, సుధాకర్, రమేష్, వెంకటమ్మ, పోశమ్మ, నరేశ్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

జనగామ రూరల్: ఈనెల 10,11 తేదీల్లో బ్యాంక్‌ల వద్ద తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చందు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు మంజురు చేయాలని, ఏకకాలంలో రుణాలు మాఫి చేయాలని అన్నారు. కొత్త రుణాలు అందించి ఆదుకోవాలని, రైతుల ఖాతాల్లో జమ అయిన రైతు బంధు, వడ్ల డబ్బులు హోల్డింగ్‌లో పెట్టడం సరికాదన్నారు. సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న ధర్నాను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అధ్వానంగా రోడ్డు..

స్టేషన్‌ఘన్‌పూర్: ఘన్‌పూర్‌కు జంటపట్టణమైన శివునిపల్లిలో అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీటీ రోడ్డు గుంతలమయమై అధ్వానంగా తయారైంది. రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా వేసిన బీటీ రోడ్డు మూన్నాళ్ల ముచ్చటగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో అంబేడ్కర్ సర్కిల్ వద్ద బీటీరోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతమయంగా మారింది. ఈ రోడ్డు వెంట లారీలు, గ్రానైట్ రాళ్లను తీసుకెళ్లే భారీ వాహనాలు, టిప్పర్ లారీలు వెళ్తుండగా రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఘన్‌పూర్ నుంచి పాలకుర్తికి వెళ్లే బస్సులు, భారీ వాహనాలు, శివునిపల్లి నుంచి నమిలిగొండ, పాంనూర్, జఫర్‌గఢ్ తదితర గ్రామాలకు వెళ్లేందుకు ఈదారి ప్రధాన రోడ్డుగా ఉంది. అయితే నాసిరకమైన పనులతో బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనదారులకు తిప్పలు తప్పడం లేదు. ఈ రోడ్డు సమస్యపై గతంలో మండల సభలో ప్రజాప్రతినిధులు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. రోడ్డంతా గుంతలమయంగా ఉండగా రెండు రోజుల పాటు కురిసిన వర్షంతో గుంతలలో నీరు నిలిచి బురదమయంగా మారింది. ద్విచక్ర వాహనదారులు గుంతలతో రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. భారీ గుంతలతో ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు సమస్యపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిష్కరించాలని కోరుతున్నారు.



శివునిపల్లి అంబేడ్కర్ సెంటర్ వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు